అభివృద్ధి పథంలో..

సెంట్రల్‌లో రూ.63.72 లక్షలతో ప్రారంభోత్సవాలు, భూమి పూజ

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి శుక్రవారం 61వ డివిజన్ శాంతినగర్‌లో రూ.15.35 లక్షల అంచనాతో నిర్మించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వాంబేకాలనీలో రూ.48.37లక్షల అంచనాతో ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో ప్రతి ప్రాంతంలో పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా వాంబే కాలనీ ఖబర్‌స్తాన్‌లో రూ.48.37 లక్షలతో ప్రహరీ, లెవలింగ్ పనులతో పాటు సీసీ నడక దారిని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. బల్లలు, లైటింగ్, ప్రార్థనలు చేసుకోవడానికి వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకెళుతున్నట్లు మల్లాది విష్ణు చెప్పారు. ఈ ఏడాది సెంట్రల్‌కు అభివృద్ధి నామ సంవత్సరంగా మిగిలిపోతుందని చెప్పుకొచ్చారు.



వాంబేకాలనీలో శ్మశానవాటిక అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు

జనవరి నెలను సంక్షేమ మాసంగా ఎమ్మెల్యే అభివర్ణించారు. జనవరి7న నగరంలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ ప్రభుత్వం నగరంలో శ్మశానవాటికల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఎంజీరోడ్డులోని ఖబర్‌స్తాన్‌ను రూ. 40లక్షల నిధులతో అభివృద్ధి పరిచినట్లు గుర్తుచేశారు. ఈ ప్రాంత మత పెద్దలతో సంప్రదింపులు జరిపి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి రెండో వారంలో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్క డివిజన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉండేలా కౌన్సిల్లో తీర్మానం చేసి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మతగురువులు ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఈ(ఇంజినీరింగ్) శ్రీనివాస్, డీఈ గురునాథం, ఏఈ మౌసమి, కార్పొరేటర్లు అలంపూరు విజయలక్ష్మి, యరగొర్ల తిరుపతమ్మ, నాయకులు హఫీజుల్లా, ఉమ్మడి వెంకట్రావు, అఫ్రోజ్, అలంపూరు విజయ్, యరగొర్ల శ్రీరాములు, ఇసరపు రాజా రమేష్, నాలంబాబు, 17 మసీదుల మత పెద్దలు, సచివాలయ సిబ్బంది పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి

విజయవాడ స్పోర్ట్స్: రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి ఏలూరు రోడ్డులోని వ్యాపారస్తులను హెచ్చరించారు. జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు ఏలూరు రోడ్డులోని వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులతో శుక్రవారం వ్యాస్ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో డీసీపీ సమావేశమయ్యారు. ఏలూరు రోడ్డులోని ట్రాఫిక్ సమస్యను పూర్తిగా పరిశీలించానని, రోడ్డుకు రెండువైపులా వ్యాపారుల విక్రయాల నిమిత్తం వస్తువులను ఉంచుతున్నట్లు గుర్తించానన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపులకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏడీసీపీ ప్రసాద్, ఏసీపీలు రామచంద్రరావు, శ్రీనివాసరావు, సీఐ మహేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పాలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అహర్నిశలు పని చేస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శుక్రవారం నలుగురికి మంజూరైన రూ. 3.57 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. వైద్య రంగంలో ముఖ్యమంత్రి తీసుకొచ్చిన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3,200 సేవలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురాగా.. కార్డు ద్వారా రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యానికి భరోసా కల్పించడం చారిత్రాత్మకమన్నారు. సెంట్రల్‌లో 1,69,376 కుటుంబాల్లో 74,585 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. వీరందరికీ గత నాలుగున్నరేళ్లలో రూ. 160 కోట్ల విలువైన వైద్య సేవలు అందించారని తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యం చేయించుకోవచ్చని చెప్పారు. జీజీహెచ్‌లో రూ.



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

23.75 కోట్లతో నూతన బ్లాక్ ప్రారంభించుకోవడం శుభపరిణామమన్నారు. కోవిడ్-19 సరికొత్త వేరియంట్ జేఎన్-1 పై ప్రజలుప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు చేయూతనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి లబ్ధిదారుల కుటుంబసభ్యులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పేరం త్రివేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయతీ

మధురానగర్ (విజయవాడసెంట్రల్): తన ఆటోలో మరిచిపోయిన సుమారు రూ. 8లక్షల విలువైన బంగారు ఆభరణాలను ఆటో డ్రైవర్ పోలవరపు నాగేశ్వరరావు తిరిగి అప్పగించి నిజాయతీని చాటుకున్నారు. వారం క్రితం తన ఫ్రెండు పెళ్లికి వెళ్లిన సందర్భంగా చేవూరి నవీన ఆటోలో కూర్చుని బిడ్డకు పాలిస్తూ ఆటోలో 8 తులాల బంగారం మర్చిపోయింది. ఆ బంగారాన్ని డ్రైవర్ నాగేశ్వరరావు నవీన కుటుంబానికి అందజేశారు. దాని విలువ రూ. 8లక్షల ఉంటుందని వారు తెలిపారు. నాగేశ్వరావుకు కతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం రైల్వే స్టేషన్ పార్సిల్ ఆఫీస్ గేట్ వద్ద నవీన అన్న చేవూరి సాగర్ ఆటో డ్రైవర్ నాగేశ్వరరావు రూ. 10వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్ బాబురావు నాగేశ్వరరావుకు శాలువా కప్పి పూలదండ వేసి పుష్ప గుచ్ఛంతో అభినందించారు.



నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్ జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ 11 కేవీ కస్తూరిబాయ్‌పేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలరెడ్డి రోడ్డు, రైల్వే క్లబ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, ఇంటెలిజెన్స్ ఆఫీస్, కస్తూరిబాయిపేట పుష్పా హోటల్ ఏరియా, కాశేశ్వరరావు రోడ్డు, ప్రకాశం రోడ్డు, లత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏరియా, పొగాకు బ్యారెన్ రోడ్డు, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, కస్తూరిబాయి పేట, బెల్లపు శోభనాద్రి వీధి, రామనాథం వీధి, చలమల వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆదివారం కూడా పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు నగరవాసులు కట్టాల్సిన పన్నులను ఆదివారం కూడా చెల్లించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, తాగునీరు, డ్రైనేజీ పన్నులను డిసెంబర్ 31, 2023 లోగా చెల్లించాలని, ఈ మేరకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న పన్ను చెల్లింపు క్యాష్ కౌంటర్లు ఆదివారం కూడా పని చేస్తాయని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని క్యాష్ కౌంటర్లు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్ నగర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడెల శేషుకు గాయాలు కాగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాష్‌నగర్ ఆర్‌ఆర్‌చికెన్ సెంటర్లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న గుడెల శేషు గురువారం రాత్రి సుజుకి షోరుమ్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. నున్న వైపు నుంచి వస్తున్న ఏపీ07టీఎఫ్-8925 నంబర్ లారీ ఢీకొంది. ఘటనలో గుడెల శేషుకు గాయాలు కాగా ప్రభు త్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శేషు కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్రకీలాద్రిపై రద్దీ సాధారణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం రద్దీ సాధారణంగా కనిపించింది. ఉదయం 6 గంటల నుంచి ఓ మోస్తరుగా ఉన్న రద్దీ మధ్యాహ్నం కాస్త పెరిగింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించడానికి అరగంట అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎస్.రమేష్ బాబులు క్యూలైన్లను పర్యవేక్షించారు.

నేడు కానుకల లెక్కింపు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, మొక్కుబడులను శనివారం లెక్కించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో కానుకల లెక్కింపు జరగనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



దుర్గగుడిలో క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న ఆలయ ఏఈవో

కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, ఏటా ఆర్యక్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన క్యాలెండర్లు ముంద్రించి పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శుక్రవారం సాయంత్రం ఆర్యక్షత్రియ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమం చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భువనగిరి వెంకట గణేష్, జిల్లా అధ్యక్షుడు పాతర్లపాటి దివాకరరావు, సభ్యులు త్రినాథ్ కుమార్, సూర్యనారాయణ, దుర్గారావు, మల్లిఖార్జునరావు, గంగాధర్ రావు, మధు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్యక్షత్రియ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

క్యాన్సర్ సోకిన 13 ఏళ్ల బాలుడికి అరుదైన చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీరంలోని మృదు కణజాలాల్లో సోకే రాబ్డోమియో సార్కోమా (ఆర్ఎంఎస్)తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడికి విజయవతంగా చికిత్స చేసినట్లు కానూరులోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు. విజయవాడకు చెందిన 13 ఏళ్ల బాలునికి మార్చి 2022 నుంచి ఎడమ కంటిలోపలి భాగంలో కంటి కాంతస్ (కనురెప్పల చివరిభాగం) వద్ద నొప్పిలేకుండా ఉన్న కణితి వచ్చింది. అది క్యాన్సర్ గడ్డగా నిర్ధారించడంతో చికిత్స నిమిత్తం తమ ఆస్పత్రికి వచ్చినట్లు డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. నిపుణుల సంరక్షణలో కీమోథెరపీ, రేడియోథెరపీతో కూడిన సమగ్ర చికిత్సను విజయవంతంగా అందించినట్లు తెలిపారు. రోగి వయస్సు 13 ఏళ్లు కావడంతో అత్యంత నైపుణ్యంతో కూడిన చికిత్స చేసి మెరుగైన ఫలితం సాధించినట్లు చెప్పారు. ఆర్ఎంఎస్ అనేది క్యాన్సర్ అరుదైన రూపంగా పేర్కొన్నారు. ఇది మృదుకణజాలాల్లో, ముఖ్యంగా పక్కటెముకల కండరాల్లో, కొన్నిసార్లు మూత్రాశయం, గర్భాశయం వంటి బోలు అవయవాల్లో కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు.

ఏపీపీడీఈఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్(ఏపీపీడీఈఏ) 2024 టెక్నికల్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం విద్యుత్ సౌధలో జరిగింది. విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ డైరీని ఆవిష్కరించారు. జేఎండీ (విజిలెన్స్) మల్లారెడ్డి టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. శేషారెడ్డి మాట్లాడుతూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న విజయానంద్, మల్లారెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ సంస్థల పరిరక్షణకు సభ్యులు పని చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమానికి డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.మహేశ్వరరెడ్డి, రాష్ట్ర ముఖ్య సలహాదారు ఎ.సుబ్బారావు, కార్య నిర్వాహక అధ్యక్షులు హుస్సేన్ ఖాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్

నూరు శాతం ఉత్తీర్ణులు కావాలి

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న ఉచిత స్టడీ మెటీరియల్ వినియోగించుకొని టెన్త్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు కావాలని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి ఆకాంక్షించారు. 62వ డివిజన్లో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్‌లో 'పది' విద్యార్థులకు జగనన్న స్ఫూర్తి ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను అందరూ వినియోగించుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో 500 పైన మార్కులు తెచ్చుకునే విద్యార్థులకు రెండు వేల రూపాయల నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఫీజు రాయితీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మోహన్, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ శివకుమార్, కమిటీ మెంబర్ కుంచం యోహాను, డివిజన్ కోఆర్డినేటర్ కుదిరేళ్ళ వీరబాబు, స్థానిక నాయకులు బోరబుజ్జి, సాంబయ్య, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి

హక్కులపై అవగాహన ఉండాలి

మైలవరం: విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని మైలవరం జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాది పీవీ సాంబశివరావు తెలిపారు. స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 219ను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. నేటి సమాజంలో వస్తు సేవలను విక్రయించేటప్పుడు వస్తు సేవలపై సమగ్ర పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఎటువంటి దోపిడీకి గురికాకుండా వినియోగదారులు మేల్కోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ వినియోగదారులు వస్తువుల నాణ్యత, నకిలీ వస్తువులను గుర్తించే అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కామర్స్ హెడ్ ఆఫ్ ది దిపార్ట్‌మెంట్ ఎం. శ్రీనివాసరావు, సీనియర్ ఫాకల్టీ ఫణికుమార్, కరిముల్లా, నారాయణరావు పాల్గొన్నారు.

• పుస్తక ప్రియుల ఉత్సవం



నగరంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న పుస్తక మహోత్సం ఆవరణ పుస్తక ప్రియులతో నిండిపోయింది. ఆధ్యాత్మిక, మానసిక వికాసం, ఇతిహాసం, సమయం సద్వినియోగం తదితర పుస్తకాలను పిన్న, పెద్ద కొనుగోలు చేశారు. ఆ ప్రాంగణంలో పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





క్లుప్తంగా

రమణ మహర్షి బోధనలు అనుసరణీయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రమణ మహర్షి బోధనలు అనుసరణీయమని ఆధ్యాత్మిక ప్రసంగీకుడు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వరశర్మ అన్నారు. రమణ మహర్షి సేవా సంస్థ ఆధ్వర్యంలో రమణుల జయంతి ఉత్సవాన్ని పాత బస్తీలోని కుసుమహరనాథ మందిరంలో వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసంగం జరిగింది. రమణులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. రెండు రోజుల పాటు విశేష జ్యోతులు వెలిగించి పూజలు కొనసాగించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కోటేశ్వరరావు, రామకృష్ణ, మారెళ్ల శ్రీనివాసు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వెల్ఫేర్ డే స్పందనలో 31 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమాన్ని కాంక్షిస్తూ జరిగిన స్పందనలో 31 ఫిర్యాదులు అందినట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. విజయవాడలోని జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది నుంచి శుక్రవారం ఫిర్యాదులు స్వీకరించారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని సీపీ రాణా అన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): నగరంలో ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపంలో నేషనల్ ఎక్స్‌పో ప్రారంభమైంది. శుక్రవారం నుంచి జనవరి 3వ తేదీ వరకు జరిగే ఎక్స్‌పోలో వివాహాది శుభకార్యాలకు భారతీయ సంప్రదాయ దుస్తుల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దీనిలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మగ్గాలపై నేసిన ఎన్నో రకాల ఉత్పత్తులు ఉంటాయన్నారు. ప్రధానంగా నేత కార్మికులు తాము ఉత్పత్తి చేసిన సిల్క్ కాటన్ వస్త్రాలపై 40 శాతం తగ్గింపుతో విక్రయిస్తున్నామని, డిజైనర్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తాలపై ప్రత్యేక తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

సలీం నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడ స్పోర్ట్స్: టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టినగర్‌కు చెందిన షేక్ సలీం నేర ప్రవృత్తిలో మార్పు రాకపోవడంతో అతని నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక కేసుల్లో నిందితుడుగా ఉన్న సలీం పలుమార్లు జైలు జీవితం అనుభవించాడని, ఆ తరువాత అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. ప్రస్తుతం బహిష్కరణలో ఉన్న సలీం జీవన శైలిలో ఎలాంటి మార్పు రాలేదని వచ్చిన పక్కా సమాచారం మేరకు బహిష్కరణను పొడిగిస్తున్నట్లు స్పష్టం చేశారు.

నేడు పుస్తక మహోత్సవంలో కార్యక్రమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం 6.00 గంటలకు: విశాలాంధ్ర పబ్లిషర్స్ వారి పుస్తకావిష్కరణ సభ జరుగుతుంది. 'జనాభా సంఖ్య- అపోహలు - భారత రాజకీయాలు' పుస్తకాన్ని భారత మాజీ ప్రధాన ఎన్నికల అధికారి వైఎస్ ఖురేషి ఆవిష్కరిస్తారు. ముఖ్యఅతిథులుగా మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్, బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, మాజీ ఎమ్మెల్యే, విశాలాంధ్ర సంపాదకమండలి అధ్యక్షులు కె.రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకమండలి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారు. శ్రీరమణ ప్రతిభా వేదికపై సాయంత్రం 5 నుంచి 8గంటల వరకూ సైన్స్ ప్రయోగాలను ప్రదర్శిస్తారు.

వేంపల్లె పుస్తకావిష్కరణ..

శనివారం సాయంత్రం ఐదు గంటలకు సీనియర్ జర్నలిస్టు, కథా రచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్ రాసిన 'టీవీ ప్రకటనల్లో భాషా సంస్కృతులు' పుస్తకం ఆవిష్కరణ జరగనుంది. షరీఫ్ మీడియాతో మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ఎక్కడ చూసినా విజృంభిస్తున్న ప్రకటనల వెనుక వేల కోట్లాది రూపాయల వ్యాపారం ఉందని దాని కోసం అవి మన మీద ఎలాంటి భాషని, సంస్కృతిని రుద్దుతాయో తాను ఈ పుస్తకంలో వివరించానన్నారు.